
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

ఆదివారం 30 నవంబరు 2025

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- సమస్యల వలయంలో గ్రామ పంచాయతీలు
- ఇప్పటికీ సొంత భవనాలు కరువు

7



మల్లన్న జాతరలో షిడీ ప్రదర్శన

150 ఏళ్ల సంప్రదాయం.. బండిషిడీ

అనంత్‌సాగర్ మల్లన్న జాతరలో విశేష ఘట్టం

పొడవాటి కర్రకు మనిషిని వేలాడదీసి..

ఆలయం చుట్టూ ప్రదక్షిణ

దత్తాత్రేయ జయంతి సందర్భంగా నేడు నిర్వహణ

జాతరలు అనగానే బోనాల ఊరేగింపు, శివసత్తుల విన్యాసాలు, పోతురాజుల ప్రదర్శనలు చూస్తుంటాం. కానీ, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంత్‌సాగర్ గ్రామంలో మల్లన్న జాతరలో మాత్రం వీటన్నిటికీ భిన్నంగా బండి షిడీ ఉత్సవం విశేషంగా నిలుస్తుంది.

సండే స్పెషల్

ప్రజాస్వామ్యంలో పోటీ అవసరం

- అభ్యర్థుల విరమణకు ఒత్తిడి తెస్తే కేసులే
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నిజాంపేటలో నామినేషన్ ఏర్పాట్లు చూస్తున్న మెదక్ కలెక్టర్

రామాయంపేట/నిజాంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల్లో పోటీతత్వం అవసరమే. ఆ పద్ధతిలోనే నిజాయితీ, నిబద్ధత కలిగిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే వీలుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. రామాయంపేట, నిజాంపేటలో శనివారం ఆయన నామినేషన్ల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం మొదటి విడత ఎన్నికల నామినేషన్లు పూర్తవగా.. ఆదివారం నుంచి రెండో విడత మొదలు కానున్నాయన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులపై ఎలాంటి ఒత్తిడి తెచ్చినా, వేలం పాటలో పదవులు దక్కించుకుంటే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అభ్యర్థులకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు ఒకేరోజులో జారీ చేసే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు. అలాగే ప్రతి అభ్యర్థి నూతన అకౌంటు ద్వారానే ఎన్నికల ఖర్చుల లావాదేవీలు జరపాల్సి ఉందన్నారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేదంటే చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, రామాయంపేట,నిజాంపేట తహసీల్దార్లు రజని కుమారి, శ్రీనివాస్, ఎంపీడీవోలు ఉన్నారు.

ఏకగ్రీవం వైపు పంచాయతీల మొగ్గు

7

తొలివిడత నామినేషన్ల ఘట్టంతో గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి మొదలైంది. శనివారం చివరి రోజు కావడంతో నామినేషన్ కేంద్రాల్లో సందడి నెలకొన్నది. సర్పంచ్, వార్డు సభ్యత్వానికి నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులతో జాతరను తలిపించింది. సాయంత్రం 5 గంటలకు సమయం ముగియగా కేంద్రాల్లో అభ్యర్థులు పెద్దఎత్తున వరుసలో వేచిఉన్నారు. ఐదులోగా వరుసలో ఉన్న వారి నుంచి అధికారులు నామినేషన్ల పత్రాలను స్వీకరించారు. పలుచోట్ల అర్ధరాత్రి వరకు కొనసాగింది.



అల్లాదుర్గం : సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ వేసేందుకు బారులు తీరిన అభ్యర్థులు

నామినేషన్ల జాతర



టేక్మాల్ : టోకెన్లను తీసుకుంటున్న నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు

సంగారెడ్డి జిల్లాలో తొలివిడత నామినేషన్ల వివరాలు
గ్రామపంచాయతీలు 136, వార్డులు 1246

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
సంగారెడ్డి	11	75	104	318
కొండాపూర్	24	151	222	601
సదాశివపేట	30	96	272	313
పటాన్‌చెరు	3	13	36	126
గుమ్మడిదల	8	57	66	187
హత్నూర	38	205	334	868
కంది	22	78	212	631

ముగిసిన తొలివిడత స్వీకరణ

చివరి రోజు జోరుగా దాఖలు

అర్ధరాత్రి వరకు కొనసాగిన పర్వం

మెదక్ అర్బన్/సంగారెడ్డి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో హంగామా నెలకొన్నది. నామినేషన్లకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు తమ మద్దతుదారులు, ప్రజలతో ధూంధాంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లారు. డప్పు చప్పులతో చౌరస్తాల్లో బాణసంచా పేల్చుతూ, ర్యాలీగా తరలివెళ్లారు. నామినేషన్ల కేంద్రాలకు అట్టహాసంగా చేరుకున్నారు. ఆఖరి రోజు కావడంతో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థులతో కౌంటర్లు సరిపోలేవు. పెద్దఎత్తున వరుసలో నిలుచున్నారు. సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయం లోపలికి చేరుకున్న అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. సమయం దాటడడంతో పలుచోట్ల నామినేషన్ దాఖలు కోసం అభ్యర్థులకు టోకెన్లను జారీ చేశారు. టోకెన్లు ఇచ్చిన వారిని పిలుస్తూ ఒక్కొక్కరి నుంచి నామినేషన్లు తీసుకునే వరకు రాత్రి అయింది. పలుచోట్ల అర్ధరాత్రి దాటినా నామినేషన్ల స్వీకరణ కొలిక్కి రాలేదు.

తొలివిడత నామినేషన్లు

మెదక్ జిల్లాలో 492 గ్రామ పంచాయతీల్లో, 4,220 వార్డులు ఉండగా తొలి విడతలో ఆరు మండలాల్లో 160 పంచాయతీలకు, 1402 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. అర్ధరాత్రి వరకు తెలిసిన సమాచారం మేరకు మొత్తంగా 160 సర్పంచ్ స్థానాలకు 770, ఇక 1402 వార్డులకు 2500 నామినేషన్లు దాఖలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 613 గ్రామ పంచాయతీలకు, 5,370 వార్డులు ఉన్నాయి. తొలి విడతలో 136 పంచాయతీలకు, 1246 వార్డులకు ఎన్నికలను నిర్వహిస్తున్నారు. 136 సర్పంచ్ స్థానాలకు 675, ఇక 1246 వార్డులకుగానూ 3,044 నామినేషన్లు దాఖలయ్యాయి.

మెదక్ జిల్లాలో..

ఈ నెల 27న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా, ఆరు పంచాయతీల్లో తొలిరోజు సర్పంచ్‌కు 55, వార్డులకు కేవలం

మిగతా 8వ పేజీలో

నామినేషన్ల వివరాలు

జిల్లా	సర్పంచ్	వార్డులు
మెదక్	770	2500
(అర్ధరాత్రి వరకు తెలిసిన సమాచారం మేరకు)		
సంగారెడ్డి	675	3,044

నేడు నామినేషన్ల పరిశీలన

దాఖలైన నామినేషన్ పత్రాలన్నీ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఉన్నాయో.. లేవోనని ఆదివారం పరిశీలన చేపట్టనున్నారు. అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలో దీన్ని నిర్వహించనున్నారు. పరిశీలన అనంతరం మిగిలిన అభ్యర్థుల్లో ఎవరైనా బరిలో నుంచి తప్పుకోవాలనుకుంటే డిసెంబర్ 3 వరకు ఉపసంహరణ గడువు ఉంది. అదే రోజు మధ్యాహ్నం అభ్యర్థులతో తుది జాబితాను వెల్లడిస్తారు. తుది జాబితాలోని క్రమ సంఖ్య ప్రకారం అభ్యర్థులు పేర్లు, గుర్తులు పొందుపర్చనున్నారు.

నేటి నుంచి రెండో విడత నామినేషన్లు

ఆదివారం నుంచి రెండో విడత గ్రామ పంచాయతీల నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానున్నది. ఈమేరకు ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాట్లు చేశారు. శనివారం పరిశీలకులు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. డిసెంబరు 2న నామినేషన్ల దాఖలుకు చివరి రోజు. రెండో విడతలో మెదక్ జిల్లాలోని తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట, మాసాయిపేట 149 పంచాయతీలు, 1,290 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో అందోలు, చౌటకూరు, పుల్కల్, వట్‌పల్లి, రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లోని 243 గ్రామాలు, 2,164 గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి.

ఖాతా కోసం బ్యాంకులకు

జోగిపేట/రేగోడు నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆశావహులు బ్యాంకుల దారి పట్టారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు తప్పనిసరిగ్గా ప్రత్యేక ఎన్నికల ఖాతాల (జీరో అకౌంట్)ను తెరవాలని ఎన్నికల సంఘం కొత్త నిబంధన జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే బ్యాంకులకు అభ్యర్థులు దారి కట్టారు. జోగిపేటలోని వాసవీనగర్ కాలనీ రోడ్డు రద్దీగా మారింది. ఉదయం నుంచి బ్యాంకు వద్ద వరుసగా అభ్యర్థులు, వారి ప్రతినిధులు పెద్దసంఖ్యలో నిలబడి జీరో అకౌంట్ కోసం వేచిఉన్నారు. బ్యాంకు సిబ్బందిపై అధికంగా పనిభారం పడడంతో అదనపు అకౌంట్లను తీసినట్టు మేనేజర్లు తెలిపారు.



నామినేషన్ల స్వీకరణ ఆలస్యమవడంతో రేగోడు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చలిమంట వేసుకున్న అభ్యర్థులు

విజయానికి వైకల్యం అడ్డు కాదు

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



జెండా ఊపుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : విజయానికి వైకల్యం అడ్డు కాదని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో మహిళా శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి దివ్యాంగుల పోటీలు నిర్వహించారు. కలెక్టర్ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులు పట్టుదల ఆత్మ విశ్వాసంతో అనుకున్నది సాధించాలన్నారు. వివిధ క్రీడల్లో దివ్యాంగులు తమ ప్రతిభను కనబర్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో లలితకుమారి, డివైఎస్‌వో ఖాసీంబేగ్, డీఎంహెచ్‌వో డా.వసంతరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ, దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలి

మెదక్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ, దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్ స్టేడియంలో దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంచారు.



పటాన్‌చెరు : రహదారిపై కమ్ముకున్న పొగమంచు

మళ్లీ చలి పంజా

- వారం రోజుల తర్వాత గణనీయంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- కోహీర్‌లో కనిష్ఠంగా 7.8 డిగ్రీలు

కోహీర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 13వ తేదీ నుంచి 21 వరకు శీతల గాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి పంజా విసిరింది. ఈ రోజుల్లో ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆ తర్వాత నుంచి మొన్నటి వరకు చలి తీవ్రత అంతగా కనిపించలేదు. వారం రోజుల తర్వాత ఒక్కసారిగా మళ్లీ చలి తీవ్రత పెరిగింది. శనివారం సంగారెడ్డి జిల్లాల్లో పది చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో 7.8 డిగ్రీలు అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లోని దామరంచలో కనిష్ఠంగా 10.2, సిద్దిపేట జిల్లాలోని పోతిరెడ్డిపేట, అంగడికిష్టాపూర్‌లో 10.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కనిష్ఠ ఉష్ణోగ్రత వివరాలు

సంగారెడ్డి జిల్లాలో కనిష్ఠంగా కోహీర్ 7.8 డిగ్రీలు, న్యాల్‌కల్ 8.6, ఝరాసంగం 8.7, మొగుడంపల్లి 8.7, అల్లోల్ 9.1, మల్‌చెల్మ 9.4, దిగ్వాల్ 9.8, సత్వర్ 9.9, కంగ్టి 9.9, కద్పల్ 10.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దొంగల పాలన అంతమైతేనే తెలంగాణ పదిలం

- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామనడం కాంగ్రెస్ మూర్ఖత్వం
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్





సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఉద్యమకారులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, మెదక్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి తదితరులు

కంది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎందరో అమరవీరుల త్యాగాలతో పోరాడి తెచ్చుకున్న తెలంగాణ పదిలంగా ఉండాలంటే దొంగల పాలన అంతం కావాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం కందిలోని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రలో, రాష్ట్ర భవిష్యత్తులో ఈరోజు అత్యంత కీలకమైన రోజుని గుర్తుచేశారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీది మూర్ఖత్వమని విమర్శించారు. తెలంగాణ చరిత్ర ఉన్నంతకాలం కేసీఆర్ ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీక్షా దివస్ ఒక మహత్తర ఘట్టం

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ చరిత్రంలో దీక్షా దివస్ ఒక మహత్తర ఘట్టమని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్‌లో్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ముందుగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, అమర వీరుల స్తూపానికి నివాళులర్పించారు.

సత్వర న్యాయ వేదిక లోక్ అదాలత్

- సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సయోధ్య ద్వారా సత్వర న్యాయం అందించే వేదిక జాతీయ లోక్ అదాలత్ అని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర అన్నారు. డిసెంబరు 21న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టు కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా వేగంగా న్యాయం అందుతుందని తెలిపారు. కోర్టులో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు శాంతియుత పరిష్కారం లభించడం లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో రాజీకి సాధ్యమైన కేసులను ముందుగానే గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా హెచ్‌ఐవీ



సంగారెడ్డి జీజీహెచ్‌లో హెచ్‌ఐవీ బాధితుల చికిత్సా కేంద్రం(ఏఆర్‌టీ సెంటర్)

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- 'ఏఆర్‌టీ' ద్వారా 4423 మందికి చికిత్స
- అవగాహనతోనే వ్యాధి నియంత్రణ
- రేపు వరల్డ్ ఎయిడ్స్ డే

సంగారెడ్డి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు చాలా దగ్గర సంబంధం ఉంది. హెచ్‌ఐవీ అనేది ఒక వైరస్. ఈ వైరస్ తీవ్రత ప్రమాద స్థాయిలో ఉండటాన్ని ఎయిడ్స్‌గా పరిగణిస్తారు. ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిలో రోగనిరోధకత పూర్తిగా నశిస్తుంది. హెచ్‌ఐవీని ముందస్తుగా గుర్తించి రోగ నిరోధకతపై ఎలాంటి దుష్ప్రభావం లేని పరిస్థితిలో యాంటీ రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) చికిత్స ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. ముందస్తు చికిత్స ద్వారా రక్తంలో హెచ్‌ఐవీ కణాల శాతాన్ని తగ్గించుకొని మెరుగైన జీవితాన్ని పొందవచ్చని డాక్టర్లు సలహా ఇస్తున్నారు. డిసెంబరు 1 (రేపు) వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనం.

ఈ ఏడాది 312 మందికి పాజిటివ్

సంగారెడ్డి జిల్లాలో హెచ్‌ఐవీ వైరస్ చాపకింద నిరులా విస్తరిస్తున్నది. జిల్లాలో 10,196 మంది బాధితులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 4,423 మంది ఏఆర్‌టీ సెంటర్ ద్వారా మందులు, చికిత్స తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే 2023-24 ఏడాదిలో 58,142 మందికి హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు చేయగా 696 మందికి పాజిటివ్ వచ్చింది. 2024-25 ఏడాదిలో 53,663 మందికి పరీక్షలు చేయగా 629 మందికి పాజిటివ్‌గా తేలింది. 2025 నవంబరు వరకు 34,850 మందికి పరీక్షలు చేయగా 312 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇందులో గర్భిణులు కూడా ఉండటం గమనార్హం. అయితే జిల్లావ్యాప్తంగా హెచ్‌ఐవీ బాధితులు 1,885 మంది 'చేయూత' పెన్షన్ పొందుతున్నారు.

అవగాహనతో నియంత్రణ

హెచ్‌ఐవీతో జీవిస్తున్న సగం మందిలో ఈ వైరస్ సంక్రమణ ద్వారా పొందామనే అవగాహన లేదు. చికిత్స చేయించుకోవడంపై ఆసక్తి చూపడం లేదు. ఈ తరుణంలో వీరందరికి మెరుగైన చికిత్స అందించి అదనంగా ఇతర అంటువ్యాధులు కూడా సోకకుండా జాగ్రత్త పడుతూ ఎయిడ్స్ వ్యాధిని ప్రపంచం నుంచి తరిమికొట్టాలని డబ్ల్యూహెచ్‌వో ఆశిస్తున్నది.

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి



హెచ్‌ఐవీ-ఎయిడ్స్ నివారణ లేని వ్యాధి. మనుషుల రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపే ఈ వ్యాధి వ్యాప్తి జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. అసురక్షిత లైంగిక చర్యతో వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన వారు సకాలంలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే జీవిత ప్రయాణం పెరిగే అవకాశం ఉంటుంది. వ్యాధి నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- డా.వసంతరావు, డీఎంహెచ్‌వో, సంగారెడ్డి జిల్లా

మేకలపై కుక్కల దాడి

- 10 మేకలు మృతి


మృతిచెందిన మేకలు

కొండాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో 10 మేకలు మృతిచెందాయి. మండల పరిధిలోని తొగర్‌పల్లి గ్రామానికి చెందిన సూర్యాపేట దయానంద మేకలను మేపుకుంటూ కుటుంబ సభ్యులతో జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం దయానందం పొలం వద్ద ఉన్న మేకల షెడ్డులోకి ఒక్కసారిగా కుక్కలు ప్రవేశించి దాడిచేశారు. ఈ దాడిలో 10 మేకలు అక్కడిక్కడే మృతిచెందాయి. తనకు జీవనాధారమైన మేకలు మృతిచెందడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు దయానందం వేడుకుంటున్నాడు.

ఆర్థిక సమస్యలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- గతంలో అన్న.. తమ్ముడు కూడా..


సుధీర్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సరైన గిరికీ లేక.. పూట గడవడం కష్టంగా మారడంతో ఆర్థిక సమస్యలు పెరిగాయి. దీంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. నలుగురు అన్నదమ్ములైన వీరి కుటుంబంలో మరో ఇద్దరు కూడా గతంలో ఇలాంటి పరిస్థితుల్లోనే ఆత్మహత్య చేసుకోగా, ఈ రోజు మరొకరు ఉరి వేసుకున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం మన్నెల్లి గ్రామానికి చెందిన నలుగురు సోదరులు హరీశ్, సుధీర్, లోకేష్, ఆదర్శ్‌లు చిన్నప్పుడు తూప్రాన్‌లోని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఇందులో చిన్నవాడైన ఆదర్శ్ ఇతర ప్రాంతానికి వెళ్లి అక్కడ పురోహిత్యం చేసుకుంటున్నాడు. రెండో వాడైన సాహాజీ సుధీర్(38) తూప్రాన్‌లో ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య పూజ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. ఆటో సరిగ్గా నడవకపోవడంతో ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో కుటుంబంలో కలహాలు చెలరేగడంతో భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని నెలన్నర క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాలని సుధీర్ పలుమార్లు కోరినా, ఆమె రాలేదు. ఆర్థిక, కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన సుధీర్ శుక్రవారం రాత్రి చిన్నమ్మ ఇంట్లో భోజనం చేసి తను అద్దెకు ఉండే ఇంటికి పడుకోడానికి వెళ్లాడు. అర్ధరాత్రి తరువాత చిన్నమ్మ కల్పనకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. ఆమె వెంటనే వెళ్లి చూడగా, ఉరి వేసుకుని కనిపించాడు. చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్-2 ఎస్‌ఐ యాదగిరి తెలిపారు. అయితే, సుధీర్ అన్న హరీశ్, తమ్ముడు లోకేష్‌లు కూడా గతంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ముగ్గురు అన్నదమ్ములు ఒకరివెనుక ఒకరు అన్నట్లుగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

రామాయంపేటలో వివాహిత ఆత్మహత్య

- భర్త వేధింపులే కారణమని బంధువులు ఆరోపణ
- అనాథైన మూడేళ్ల బాలుడు


వందన(ఫైల్)

రామాయంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట బీసీ కాలనీలో చోటు చేసుకున్నది. కామారెడ్డికి చెందిన బచ్చు వందన(24), నరేష్ ఐదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. కట్నకానుకలు ఇచ్చి వందన తల్లిదండ్రులు పెళ్లి జరిపించారు. పెళ్లయిన రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన వందన శనివారం బెడ్‌రూం తలుపులు పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో భార్య కనిపించకపోవడంతో భర్త నరేష్ బెడ్‌రూం తలుపులు పగులగొట్టి చూడగా వందన విగతజీవిగా కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారి సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారమందుకున్న ఎస్‌ఐ బాలరాజు మృతదేహాన్ని మార్చురీకి తరలించి, మృతురాలి తరఫు వారికి చెప్పారు. మృతురాలికి మూడేళ్ల బాలుడు ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులకు రాత్రివరకు కూడా ఫిర్యాదు రాకపోవడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా భర్త అదనపు కట్నం వేధింపులకు వందన ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తరఫు బంధువులు ఆరోపించారు.

చికిత్స పొందుతూ గృహిణి మృతి

పటాన్‌చెరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంటలు అంటుకొని చికిత్స పొందుతున్న ఓ గృహిణి మృతిచెందింది. ఎస్‌ఐ సుభాష్ వివరాల ప్రకారం.. పటాన్‌చెరు చైతన్యనగర్‌లో నివాసముంటున్న లక్ష్మి(38) ఇంట్లో పెయింట్ వేసుకున్న తరువాత మిగిలిపోయిన టర్పెంట్ ఆయిల్‌ను వంట గదిలో సజ్జపై పెట్టింది. గురువారం ఉదయం వంట చేస్తున్న సమయంలో టర్పెంట్ ఆయిల్ సజ్జ పైనుంచి కిందికి కారుతూ ఆమెపై పడి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. వెంటనే ఆమె బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కలవారు మంటలను ఆర్పి ఆస్పత్రిలో చేర్పించగా.. శనివారం మృతిచెందింది. కుమారుడు నీరుడి దినేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అనారోగ్యంతో మాజీ మావోయిస్టు మృతి


బాలనరసయ్య (ఫైల్)

కొండపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపాక గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు బాలనరసయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఆయన అకాల మరణం చాలా బాధాకరమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కొండపాకలో ఆయన భౌతికకాయానికి పలువురు మాజీ మావోయిస్టులు, నాయకులు నివాళులర్పించారు. బాల నరసయ్య 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చల్లో పాల్గొన్నారు. 20 ఏళ్ల అజ్ఞాత జీవితంలో మావోయిస్టు పార్టీ సీనియర్ నాయకులు ఆర్‌కే సెక్యూరిటీ ఇన్‌చార్జిగా పనిచేశారు. పార్టీలో ఆయన దయ, రవన్న, విజయ్‌కుమార్, శ్రీకాంత్ పేర్లతో పనిచేశారు. కొన్నేళ్ల క్రితం లొంగిపోయాడు. శనివారం కొండపాకలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో విమలక్క, నర్సింలు, షకీల్, రామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశం, ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శి భానుచందు, రమేష్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రెండున్నర ఏళ్ల పాపతో తల్లి అదృశ్యం


అదృశ్యమైన తల్లి బిడ్డ(ఫైల్)

నర్సాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రెండున్నర ఏళ్ల పాపతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని వసురాంతండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న దేవదత్తు రాము, భార్య కావేరి భార్యాభర్తలు. వీరికి రెండున్నరేళ్ల కూతురు భవాని ఉన్నది. ఆరోగ్యం బాగాలేదని నర్సాపూర్ ఆస్పత్రిలో చూయించుకుంటానని భార్య చెప్పడంతో రాము ఆటోలో వదిలేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కావేరికి ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పటాన్‌చెరులో యువతి


తాబుసం

పటాన్‌చెరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ వ్యవహారంపై కుటుంబసభ్యులు మందలించారని ఓ యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ వివరాల ప్రకారం.. పటాన్‌చెరులో నివాసముంటున్న తాబుసం బోరబండకు చెందిన ఓ అబ్బాయితో ఉన్న ప్రేమ వ్యవహారంపై బంధువులతో చర్చించారు. ఇందుకు వారు అంగీకరించకపోవడంతో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో భోజనం చేసిన తరువాత బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అన్న ఎండీ.అర్బన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వృద్ధురాలి పుస్తెల తాడు అపహరణ

కొమురవెల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు అపహరణకు గురైన సంఘటన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ కోనేరు సమీరంలోని ఇంట్లో చోటు చేసుకున్నది. శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలు అనసూర్య మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడును అపహరించుకపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని సీఐ ఎల్.శ్రీనివాస్ ఎస్‌ఐతో కలిసి పరిశీలించారు.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్రంలోని జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రారావు ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎన్.గౌతమ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం మొత్తం 38 మందిని ఇన్‌చార్జీలుగా నియమించింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాకు సంగారెడ్డికి పెడాకుల శ్రీనివాస్, మెదక్ బోఖా నర్సింహారెడ్డి, సిద్దిపేట జె.సంగప్పలను నియమించింది.

కార్మికులపై కక్ష సాధిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు



సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు

సంగారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్మికులపై కక్ష సాధిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో వారు మాట్లాడారు. పాశమైలారం ప్రాంతంలోని బిస్లరీ, మల్లెపల్లి పరిధిలోని మైక్రో బాక్స్ పరిశ్రమల్లో కార్మికులు చట్ట ప్రకారం యూనియన్‌ను ఏర్పాటు చేసుకుంటే యాజన్యాలు కక్ష సాధింపులకు పాల్పడుతూ కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశ్రామికవాడలో కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఆయా పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బాగారెడ్డి, ప్రవీణ్, ప్రసన్నరావు, విష్ణు, శ్రీనివాస్, శివ, మల్లేష్, భీమ్‌రెడ్డి, వేణు, ప్రశాంత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

పెద్దశంకరంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని మంథని పాఠశాలల్లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నర్సరీ నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ఎంఈవో వెంకటేశం సందర్శించి విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగనాథ్‌రావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలి

● ఉమ్మడి జిల్లా ఎక్స్ పెండేచర్ అధికారి జుల్ఫీ



పెద్దశంకరంపేటలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ఎక్స్ పెండేచర్ అధికారి జుల్ఫీ

పెద్దశంకరంపేట/టేక్మాల్/గజ్వేల్/కంది/వర్గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ఎక్స్ పెండేచర్ అధికారి జుల్ఫీ అన్నారు. శనివారం పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించి ఎన్నికల అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పేట ఎంపీడీవో షాకీర్‌అలీ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో క్రాంతికుమార్, ఆర్ఐ.రమేష్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల నామినేషన్ వేసే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ జుల్ఫీఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో రియాజొద్దీన్‌ను నామినేషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే టేక్మాల్ నిర్వహిస్తున్న నామినేషన్ ప్రక్రియకు చేపడుతున్న బందోబస్తును మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాయికిషోర్ పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ క్లస్టర్‌లో పంచాయతీరాజ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అబ్జార్వర్ కే.హరిత పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని కాశీపూర్, కంది రైతువేదికలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీకొరెడ్డి జడ్పీసీఈవో జానకీరెడ్డి, హౌసింగ్ పీడీ చలపతిరావుతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సుధీర్‌రెడ్డి, సరిత తదితరులు ఉన్నారు. వర్గల్ మండలంలోని గౌరారం క్లస్టర్‌లో సింగాయిపల్లి, గౌరారం, చౌదరిపల్లి, చాంద్‌ఖాను మక్తా, అవుసులోనిపల్లి గ్రామపంచాయతీల నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు హరిత పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సౌకర్యాలు ఉన్నాయా, హెల్ప్, ఆర్వో పనితీరును పరిశీలించారు. గ్రామపంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు చేయాలనుకుంటే 6305956344 నంబరు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

జిల్లాలో స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల పరిశీలకులు కార్తీక్‌రెడ్డి, రాకేష్
● కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థానిక సంస్థల (గ్రామపంచాయతీ) ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు కార్తీకొరెడ్డి, రాకేష్ ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 29తో ముగిసిందని, నేటి నుంచి రెండోవిడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని నోడల్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జానకీరెడ్డి, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు కొత్త కార్యవర్గాలు కొలువు దీరుతున్నాయి. ఏళ్లుగా ఎన్నికలు లేని పంచాయతీలను తీర్చిదిద్దే బాధ్యత వారిపై ఉన్నది. అయితే ఉమ్మడి జిల్లాలో పలు గ్రామపంచాయతీ భవనాల పరిస్థితి అధ్వానంగా ఉంది. కొత్తగా జీపీలను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం భవనాలకు నిధులు మంజూరు చేసినా పనులు పూర్తి చేయడంపై శ్రద్ధ చూపలేదు.



వెల్దుర్తి : పూర్తయిన రామాయిపల్లి గ్రామపంచాయతీ భవనం



నర్సాపూర్ : జక్కపల్లిలో అసంపూర్తి దశలోనే నిలిచిపోయిన పంచాయతీ భవనం

అద్దె భవనాలు.. అరకొర వసతులు..

● సమస్యల వలయంలో 'పంచాయతీ'లు
● ఇప్పటికీ సొంత భవనాలు కరువు



నూతనంగా ఏర్పడిన శేరి గ్రామపంచాయతీ



వెల్దుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి మండలంలోని 21 గ్రామపంచాయతీలు ఉండగా.. పాత గ్రామపంచాయతీల్లో అన్ని గ్రామాలకు పంచాయతీ భవనాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆరు గ్రామపంచాయతీల్లో ఇప్పటికీ భవనాలు లేవు. రామాయిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణం పూర్తయింది. చర్లపల్లి, ఆరెగూడెం గ్రామాల్లో స్లాబ్ లెవల్, బస్వాపూర్ గ్రామంలో పనులు ప్రారంభమయ్యాయి. మహ్మద్‌నగర్‌తండాలో పనులు ఇంకా ప్రారంభంకాలేదు. కాగా శంశిరెడ్డిపల్లితండాలో గ్రామపంచాయతీ భనవం మంజూరై రద్దయింది. వీటితో పాటు నూతనంగా ఏర్పాటైన శేరీల, ఎల్కపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు లేవు. ఆరెగూడెంలో ప్రైవేటు భవనంలో.. మరో ఐదు గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల్లో పంచాయతీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.



నారాయణఖేడ్ : పాఠశాల భవనంలో కొనసాగుతున్న మాద్వార్ తండా గ్రామపంచాయతీ కార్యాలయం

17 పంచాయతీలకు సొంత భవనాలు కరువు

నర్సాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలో 35 పంచాయతీలు ఉండగా.. ఇందులో 17 గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో సొంత భవనాలు నిర్మించేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న మదన్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా.. పంచాయతీ భవనాల నిర్మాణాలు అసంపూర్తి దశలోనే ఉన్నాయి. మంజూరు చేసిన నిధులు సరిపోవనే ఉద్దేశంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదన్న ప్రచారమూ ఉన్నది. మండలంలోని జక్కపల్లిలో అప్పటి సర్పంచ్ వెంకటలక్ష్మి భర్త శ్రీనివాస్ పంచాయతీ భవన నిర్మాణ పనులు మొదలుపెట్టినా బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. తుల్జారాంపేటలో అప్పటి సర్పంచ్ సామ్యానాయక్ అప్పులు చేసి పంచాయతీ భవనాన్ని పూర్తిచేసినా బిల్లులు రాకపోవడంతో చివరగా కొన్ని మిగిలి ఉన్న పనులను అలాగే వదిలేశారు. ఈ భవనం దాదాపు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ప్రైవేట్, పాఠశాల భవనాల్లో 'పంచాయతీ'లు

నారాయణఖేడ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలంలో 47 గ్రామపంచాయతీలుగా ఉండగా, 12 గ్రామపంచాయతీలకు ఇప్పటివరకు పంచాయతీ కార్యాలయ భవనాలు నిర్మించలేదు. దీంతో మాద్వార్‌తండా, అకలాయితండా, ఖాంజీపూర్, జి.హుక్రాన, జూజాల్‌పూర్, పోతన్‌పల్లి, ఆర్ తుర్కపల్లి తండా, గోప్యానాయక్‌తండా, గ్రామపంచాయతీలకు భవనాలు లేవు. కొన్ని గ్రామపంచాయతీలకు నిధులు మంజూరైనా.. కొన్నిచోట్ల పనులు ప్రారంభించలేదు. మాద్వార్‌తండా, అకలాయితండాల్లో పాఠశాల భవనాల్లో, జూజాల్‌పూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి. జి.హుక్రాన, ఖాంజీపూర్, డీఎస్‌టీతండా, జూజాల్‌పూర్ తదితర చోట్ల ఇంకా పనులు ప్రారంభం కాలేదు. దీనికితోడు లింగనాయక్‌పల్లి, గుండు, హనుమాన్‌తండాలు నూతన పంచాయతీలుగా ఏర్పడడంతో ఇక్కడా కార్యాలయాలు లేవు. మొత్తం మీద నారాయణఖేడ్ మండలంలో 12 గ్రామపంచాయతీలకు, గ్రామ పంచాయతీ భవనాలు లేవు.


ఏకగ్రీవం వైపు 'పంచాయతీల' మొగ్గు..

● 16 పంచాయతీలు ఏకగ్రీవం
● సంబరాలు జరుపుతున్న ప్రజలు

కంది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల వేల ఉమ్మడి జిల్లాల్లో ఏకగ్రీవాల జోరు నడుస్తోంది. పలు గ్రామాల అభివృద్ధి కోసం గ్రామస్థులందరూ చర్చించుకుని పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని తునికిల తండా గ్రామపంచాయతీ సర్పంచ్, 8 మంది వార్డుసభ్యులను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాట్రోత్ మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలిసి ఈసారి నామినేషన్ అధికార పార్టీ అభ్యర్థులనే ఏకగ్రీవం చేసుకున్నారు. సర్పంచ్‌గా నేనావత్ కిషన్‌నాయక్, ఉపసర్పంచ్‌గా 8వ వార్డుసభ్యుడు నేనావత్ అంబర్‌సింగ్‌ను, 8 మంది వార్డుసభ్యులు ఏకగ్రీవయ్యారు.

'పేట'లో నలుగురు సర్పంచులు ఏకగ్రీవం

పెద్దశంకరంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండలంలో మొత్తం 27 గ్రామపంచాయతీలు ఉండగా, నాలుగు గ్రామపంచాయతీలకు శనివారం సాయంత్రం వరకు ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో సర్పంచ్ ఏకగ్రీవం ఖరారవుతున్నట్లు తెలుస్తుంది. పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఇసుకపాయలతండాకు చెందిన దేవసోత్ కవిత, సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన పి.బాలమణి, మాడ్చేట్‌పల్లి గ్రామానికి చెందిన గాజుకుమార్, గట్టుకిందితండాకు చెందిన మునావత్ రాజు ఏకగ్రీవ సర్పంచులుగా ఎన్నిక కానున్నారు.



కంది : ఏకగ్రీవమైన తునికలతండా పంచాయతీ నూతన పాలకవర్గంతో గ్రామస్థులు, నాయకులు

జగదేవ్‌పూర్‌లో మూడు గ్రామాలు..

జగదేవ్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలుగుగడ్డ, కొండాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవంగా ఖరారయ్యాయి. పలుగుగడ్డ సర్పంచ్‌గా నర్ర కనకయ్య, కొండాపూర్ సర్పంచ్‌గా సుప్పరి పుష్ప, అనంతసాగర్ సర్పంచ్‌గా క్యాసారం కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు, యువత, పెద్దలు సంబరాలు జరుపుకున్నారు. అలాగే గజ్వేల్ మండలం రంగంపేట సర్పంచ్‌గా వరిగొప్పుల నాగరాజు ఏకగ్రీవయ్యారు. వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్తా సర్పంచ్‌గా మేథిని సజనిత, వర్గల్ మండలం గుంటిపల్లి సర్పంచ్‌గా బొమ్మ మహంకాళి, రాయపోల్ మండలం పెద్ద ఆరెపల్లి సర్పంచ్‌గా దివ్యకృష్ణ ఏకగ్రీవమయ్యారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని గ్రామ పెద్దలు అశాభావం వ్యక్తం చేశారు.

లింగాయిపల్లితండా ఏకగ్రీవం..

దౌల్తాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దౌల్తాబాద్ మండలంలోని మొట్టమొదటిగా లింగాయిపల్లితండా సర్పంచ్‌గా గుగులోతు లక్యానాయక్ ఏకగ్రీవమయ్యారు. 486 మంది ఓటర్లు తండా అభివృద్ధికి లక్యానాయక్‌ను ఏకగ్రీవం చేశారు. తండా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని లక్యానాయక్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. సర్పంచ్ బరిలో..

● తాత ఆశయం మేరకు పోటీ



కంజర్ల చంద్రశేఖర్

చిన్నశంకరంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆయన అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పదేళ్లుగా అక్కడే కుటుంబంతో ఉంటున్నారు. ఆయన తాత ఆ గ్రామానికి 40 ఏళ్లుగా సర్పంచ్.. తాను చేసినట్లే తన మనవడూ గ్రామానికి సేవ చేయాలని భావించాడు. ఆయన ఆశయాన్ని నెరవేర్చడం కోసం ఆ మనవడు అమెరికాలో ఉద్యోగం వదిలి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట గ్రామానికి చెందిన కంజర్ల చంద్రశేఖర్ అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి. పదేళ్లుగా అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. అతని తాత కంజర్ల శంకరప్ప చినశంకరంపేట సర్పంచ్‌గా 40 ఏళ్ల పాటు సేవలు అందించారు. ఆయన హయాంలో గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. ఆయన తర్వాత మరికొందరు సర్పంచ్‌లుగా ఎన్నికైనా శంకరప్ప ముద్ర గ్రామంపై అలాగే ఉంది. అయితే, తన తాతలాగే తానూ గ్రామానికి సేవ చేయాలని ఎన్నారై కంజర్ల చంద్రశేఖర్ ఆరు నెలల క్రితం గ్రామానికి వచ్చి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా ఆయన పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సర్పంచ్‌గా పోటీ చేసేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి వచ్చినట్లు ఈ సందర్భంగా కంజర్ల చంద్రశేఖర్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

సండే స్పెషల్





ఖేడ్ మండలంలోని అనంత్‌సాగర్‌లో వెలసిన మల్లన్న దేవుడు, మల్లన్న జాతర సందర్భంగా షిడీ ప్రదర్శన చేస్తున్న భక్తుడు(ఫైల్)

150 ఏళ్ల సంప్రదాయం.. బండిషిడీ ఉత్సవం

● అనంత్‌సాగర్ మల్లన్న జాతరలో విశేష ఘట్టం
● పొడవాటి కర్రకు మనిషిని వేలాడదీసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ
● దత్తాత్రేయ జయంతి సందర్భంగా నేడు నిర్వహణ

నారాయణఖేడ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనంత్‌సాగర్‌లో దాదాపు 200 ఏళ్లక్రితం రాయిదొర పాలనలో కలరా వ్యాధి సోకింది. ఆ సమయంలో సాధుసంతులు... వ్యాధి బారి నుంచి ప్రజలను కాపాడడం కోసం కర్ణాటకలోని మైలారంలో ఉన్న మల్లన్నదేవుడి విగ్రహాన్ని తెచ్చి గ్రామంలో ప్రతిష్ఠించాలని సూచించినట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. దీంతో గ్రామస్థులంతా ఏకమై మైలారం వెళ్లి దేవుడిని తీసుకొచ్చి గ్రామంలో ప్రతిష్ఠించారు. అప్పటినుంచి కర్ణాటకలో నిర్వహిస్తున్న మాదిరిగానే ఇక్కడ కూడా ప్రతీ సంవత్సరం మార్గశిరం ప్రారంభంలో, దత్తాత్రేయ జయంతి సందర్భంగా మల్లన్న జాతరను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు సుమారు 150 సంవత్సరాలకుపైగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. జాతరలో విశేష ఘట్టమైన తన్మయత్వంతో నిర్వహించే బండిషిడీ ఉత్సవం ప్రధానంగా ఆకట్టుకుంటుంది.

కర్రను పట్టుకుని..

మల్లన్న దేవుడికి మొక్కులు తీర్చుకోవడానికి గ్రామస్థులు ప్రత్యేకంగా తయారుచేసిన బండికి పొడవాటి కర్రను అమర్చుతారు. ప్రదర్శన చేసే భక్తుడిని ఒక కాలును ఆ కర్రకు చివరన కట్టి, ఆయనను ఆకాశంలోకి వేలాడదీస్తారు. ఆ భక్తుడు ఒక చేతితో కర్రను పట్టుకుని, మరో చేతితో భక్తులపై కుంకుమ, పసుపు, వేపాకును చల్లుతుంటాడు. అత్యంత ప్రమాదకరంగా కనిపించే ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివస్తారు. ఆ భక్తుడిని గుడి చుట్టూ ఐదు మార్లు తిప్పుతారు. పూర్వం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని గ్రామానికి చెందిన ఒకే కుటుంబ వారసులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. బండిషిడీ ప్రదర్శనతో పాటు జాతర సందర్భంగా శివసత్తుల ప్రదర్శనలు, వీధి నాటకాలు, బోనాలు, బండ్ల ఊరేగింపు వంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తారు. 30వ తేదీ ఆదివారం బండిషిడీ ప్రదర్శన కొనసాగనున్నది.

దేవుడిపై నమ్మకంతో



దేవుడిపై నమ్మకంతో మా కుటుంబ సభ్యులు 150 ఏళ్ల నుంచి షిడీ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. జాతర రోజే ఒగ్గు కుటుంబంలో నుంచి ఒకరిని షిడీ ప్రదర్శనలో పాల్గొనడానికి ఎంపిక చేస్తాం. ఎవరూ ప్రదర్శనలో పాల్గొంటారో వారి గృహం నుంచి భాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్లి షిడీకి కట్టి ఊరేగిస్తారు.

- ఒగ్గు శంకర్, షిడీ ప్రదర్శన కుటుంబసభ్యుడు

వైభవంగా కల్యాణానికి ఏర్పాట్లు



మా గ్రామంలో మల్లన్న జాతరను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 11 గంటలకు మల్లన్న కల్యాణం నిర్వహించనున్నాం. కల్యాణోత్సవానికి మాజీ మంత్రి హరీశ్‌రావును ఆహ్వానించాం. కల్యాణోత్సవంలో భక్తులు భారీగా పాల్గొంటారు.

- సిద్దు, అనంత్‌సాగర్ గ్రామస్థుడు

అందెశ్రీ ప్రజాగొంతుక



సభలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి అందెశ్రీ ప్రజాగొంతుక అని ప్రముఖ కవులు తైదల అంజయ్య, డాక్టర్ పొన్నల బాలయ్య పేర్కొన్నారు. శనివారం టీపీటీఎఫ్ సిద్దిపేట జోన్ ఆధ్వర్యంలో అందెశ్రీ, కే.నారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. టీపీటీఎఫ్ కన్వీనర్ ఏ.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభకు వారు హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకాలంలో ప్రజాగొంతుకై, ప్రజల పక్షాన నిలబడి, కొట్లాడి తెలంగాణ సాధనకు కృషిశారన్నారు. తెలంగాణ ఉద్యమమే కాకుండా సామాజిక ఉద్యమాల్లో, తెలంగాణ రాష్ట్ర గీతం రాయడంలో అందెశ్రీ ఎంతో చొరవ చూపారని గుర్తుచేశారు. మానవ విలువల కోసం ప్రజల కోసం ఎలుగెత్తి చాటి, గొంతెత్తి పాడారని, వారికి ఘన నివాళులర్పిస్తున్నామన్నారు. అలాగే కే.నారాయణ మృతి ఉపాధ్యాయ లోకానికి తీవ్ర లోటని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీ.తిరుపతిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు తిరుపతి, జానకీరాములు, రాంరెడ్డి, కృష్ణ, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న భీమ్‌సేన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇంటర్ డీపీఎస్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం పాఠశాల వైస్ చైర్మన్ టి.భీమ్‌సేన్, ప్రిన్సిపాల్ సిజె వసంత పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 17 రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వరుసగా మూడో ఏడాది కొల్లూరు డీపీఎస్ ఈ పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. అండర్-10, 13, 15, 17 వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.



రాష్ట్రస్థాయి క్రీడలకు పటాన్‌చెరు వేదిక : ఎమ్మెల్యే

పటాన్‌చెరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో క్రీడా పోటీలు నిర్వహించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మైత్రి మైదానంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాపోటీలను ప్రారంభించారు. విద్యార్థులు జిల్లాలవారీగా పరేడ్ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆటలపట్ల ఆసక్తి చూపించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, విజయకుమార్, హరికిషన్, శ్రీకాంత్, హనుమంతరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి

రేగోడు నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంటను సాగు చేసి రైతులు అధిక దిగుబడి పొందవచ్చని రేగోడు వ్యవసాయ అధికారి రాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని జగిర్యాలలో రైతు ధనరాజ్ సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో మహేష్, లీవ్ పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ ఉన్నారు.

పాఠశాలలో నీటిశుద్ధి ప్లాంటు

తూప్రాన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి రావెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ (నీటి శుద్ధి ఆర్వో ప్లాంటు)ను ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేశారు. విద్యార్థుల అవసరాలు గుర్తించి సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థను ఎంఈవో అభినందించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టుమేనేజర్ ప్రవీణ్‌కుమార్,ప్రధానోపాధ్యాయుడు శైలేంద్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

కొడిపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పోల నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ బీజేపీలు రెండు ఒక్కటే అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ రాజు నాయక్, మాజీ సర్పంచ్‌లు కాంతరావు, శ్యాంసుందర్‌రావు, మాజీ ఎంపీటీసీలు ప్రవీణ్, నవీన్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన రాజు, కృష్ణవేణి రాజు, వడ్ల శేఖర్, బేగరి సంతోష్‌తో పాటు 20మంది నాయకులు, కార్యకర్తలు, పెద్దచెల్మడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేపల్లి నర్సింలుతోపాటు 10మంది కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మండల సీనియర్ నాయకుడు శివశంకర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అందుకు బీఆర్ఎస్ వైపు యువత మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ మండల నాయకుడు సంగ్రామ్ పటేల్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూ ఐజేయూ ధర్నాను విజయవంతం చేయండి

జోగిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన జర్నలిస్టులు డిసెంబరు 3న చేపట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూ ఐజేయూ అందోల్ నియోజకవర్గం అధ్యక్షుడు కనకంటి భూమయ్య కోరారు. ఆయన శనివారం జోగిపేటలో వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు రెగ్యులర్‌గా అక్రిడేషన్ కార్డులను, హెల్త్ కార్డులు, మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొత్తపల్లి గ్రామపంచాయతీలో.. నాడు ఏకగ్రీవం.. నేడు పోటీకి సై

- రసవత్తరంగా రాజకీయాలు
- గత ఎన్నికల్లో సర్పంచ్, ఉపసర్పంచ్ పదవుల కోసం ఒక అంగీకారానికి వచ్చిన ఇరు పార్టీలు



కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

గుమ్మడిదల, నవంబరు (ఆంధ్రజ్యోతి): మొన్న ఎన్నికలో ఏకగ్రీవాలతో ప్రశాంతంగా సాగిన గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నాడు రెండు పార్టీలు కలసి సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను ఏకగ్రీవంగా పొందిన పరిస్థితి.. నేడు అందుకు పూర్తిగా భిన్నంగా మారిపోయింది.

ఎత్తులకు పై ఎత్తులు

గ్రామంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను రంగంలో దింపారు. గ్రామ రాజకీయాల్లో కీలకంగా నిలిచిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థిని సర్పంచ్ అభ్యర్థిగా రంగంలో దింపుతున్నారు. జిల్లా రాజకీయాల్లో కీలకంగా కాంగ్రెస్ పార్టీలో వ్యవహరిస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తరఫున అభ్యర్థిని రంగంలోకి దింపుతూ.. గట్టిపోటీనిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యవస్థల ఏర్పాటును తన ప్రధాన ఎజెండాగా ముందుకు తెచ్చారు. నాడు కలిసి ఒప్పందంతో కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకొని ఇద్దరు నాయకులు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు సర్పంచు పదవి, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఉప సర్పంచ్ పదవి దక్కించుకున్నారు. నేడు పరిస్థితులు ప్రభావంతో గ్రామంలో పార్టీ బలపేతం చేస్తూ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని ఇరు వర్గాలు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. ఇరు పార్టీలో రంగంలో పోటీ పడుతుండడంతో ఈసారి ఓటర్లు మరోసారి పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లభించింది.

ప్రత్యేక వ్యూహాలతో ఇరువర్గాలు బిజీ

ఇరు పార్టీలు తమ వర్గాలను బలోపేతం చేసుకోవడంలో బిజీగా ఉన్నాయి. గ్రామంలోని యువత, మహిళలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు అందరికీ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ ఇద్దరూ తమ అనుకూల వాతావరణాన్ని సృష్టించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గ్రామంలో గతంలో జరిగిన ఏకగ్రీవం అప్పటి రాజకీయ అవసరం, పరిస్థితుల ప్రభావమని కొందరు పెద్దలు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తును నిర్ధారించే ఎన్నికగా భావిస్తుండడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పోటాపోటీగా సాగుతుండటంతో పోలింగ్ రోజున భారీగా ఓటింగ్ నమోదయ్యే అవకాశం ఉందని స్థానికులు అంచనా వేస్తున్నారు. కొత్తపల్లిలో నిన్నటి ఐక్యత నేడు పోటీగా మారి గ్రామ రాజకీయాల్లో కొత్త సమీకరణలకు దారి తీయడం గమనార్హం.

తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

చేగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల తపస్ నూతన పాలకవర్గం ఎన్నుకున్నారు. శనివారం మెదక్ జిల్లా తపస్ అధ్యక్ష కార్యదర్శులు జిడ్డి ఎల్లం ,చల్లా లక్ష్మణ్‌లు ఆధ్వర్యంలో చేగుంట మండల తపస్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులుగా రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తపస్ సంఘ నాయకులు మల్లారెడ్డి పట్వారి యాదగిరి, బాల్ శెట్టి రేఖ, సుమతి, మంజులత, సంధ్యారాణి, ఉమాదేవి, శ్రీలత, శ్రీదేవి, వనిత, రేవతి, శ్రీనివాస్, సంగీత, విజేత, స్వరూప రాణి, దేశపతి కృష్ణమూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం చేసింది




నర్సాపూర్‌లో ప్రధాన చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

మెదక్ అర్బన్/నర్సాపూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై బీసీలను మోసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం మెదక్, నర్సాపూర్‌లలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. రిజర్వేషన్లపై మోసం చేసిన కాంగ్రెస్‌కు బీసీలు బుద్ధి చెప్పాలన్నారు.

శనివారం మెదక్‌లోని స్థానిక రాందాస్ చౌరస్తాలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి సిద్ధమైన నాయకులను, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దాంతో బీజేపీ నేతలు.. పోలీసులు మధ్య తోపులాట చోటు చేసుకున్నది. ఈ క్రమంలో సీఎం దిష్టిబొమ్మను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి పోస్టర్‌ను దహనం చేయడానికి యత్నించగా ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు.

మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు. నర్సాపూర్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఎస్టీమోర్చా జిల్లా నాయకుడు రాములునాయక్, ఓబీసీ జిల్లా నాయకుడు గుండం శంకర్, పట్టణ అధ్యక్షుడు నీరుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాములు(ఫైల్)

చేగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న నార్సింగ్ మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన ధర్మారం రాములు (45) అనే వ్యక్తి తన తల్లితో కలిసి బైక్‌పై రామాయంపేట వైపునకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో తల్లి ఘటనాస్థలంలో అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన రాములును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ 19 రోజులుగా చికిత్స పొందుతున్న రాములు శనివారం మృతి చెందాడు.

పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

నారాయణఖేడ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆన్ష్ ఫౌండేషన్ పుస్తకార్ ఆధ్వర్యంలో శనివారం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గ్రంథాలయంలో రూ.50 వేల విలువ గల 450 పుస్తకాలను సమకూర్చగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్మథకిషోర్ గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శోభా బన్సాలీ, ప్రోగ్రాం డైరెక్టర్ శృతి హెగ్డె, రాజేశ్వర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

కాశీ క్షేత్రంలో శ్రీమద్భాగవత జ్ఞానయజ్ఞం





కాశీక్షేత్రంలో భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతిస్వామి

నారాయణఖేడ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో ఉత్తర్ ప్రదేశ్‌లోని కాశీ క్షేత్రంలో శ్రీమద్భాగవత జ్ఞానయజ్ఞం కార్యక్రమాన్ని డిసెంబరు 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈనెల 28 నుంచి ఏడు రోజుల పాటు కాశీ క్షేత్రంలోని జంగమవారి మఠంలో ఈ యజ్ఞం నిర్వహిస్తుండడంతో తెలంగాణ ప్రాంతం నుంచి 3 వేల మంది భక్తులు కాశీకి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం భాగవత పారాయణం, చండీహోమం, కోటి రుద్రం, కోటి శ్రీసూక్త పారాయణం, అతిరుద్రపారాయణం, సహస్ర బ్రాహ్మణ భోజనం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ఒక రోజు కార్యక్రమం అనంతరం అయోధ్యలో కూడా ఒక రోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

చిన్న చెల్మెడలో వైభవంగా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణోత్సవంలో భక్తులతో బీఆర్ఎస్ నాయకుడు పైతర సాయికుమార్

మునిపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న చెల్మెడ గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఇందులోభాగంగా శనివారం రేణుకాఎల్లమ్మ తల్లి కల్యాణం గ్రామానికి చెందిన కళాలి అడివయ్యగౌడ్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మాజీ ఎంపీటీసీ మంద రాజశేఖర్, మాజీ సర్పంచు నరేష్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఒగ్గు మోహన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో భక్తుల సందడి

నారాయణఖేడ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో తెల్లవారు జామున అభిషేకం, చందనం, మహాహారతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ ఆశీస్సులు అందజేసి దాతల సహకారంతో మహాప్రసాదాన్ని అందించారు.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన సంగారెడ్డి అదనపు కలెక్టర్



హోతి (బి)లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జహీరాబాద్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) జహీరాబాద్ మండలంలోని హోతి(బి) గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సందర్శించారు. రెండో విడతలో భాగంగా నామినేషన్ వేయడానికి వచ్చే సర్పంచ్, వార్డు సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ దశరత్, తదితరులు ఉన్నారు.

● **ఝరాసంగం:** మండలంలోని 33 గ్రామ పంచాయితీలలో ఈ నెల 14 న జరిగే రెండో విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలపై ఎంపీడీవో మంజుల ఆర్వో, ఏఆర్వోలతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యలయంలోని ఎన్నికల సామగ్రిని ఆర్వో, ఏఆర్వోలకు అందజేశారు. సమావేశంలో ఎంపీఈవో స్వాతి, ఏపీవో రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి



ఎంపీపీ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో రమాదేవి

చిన్నశంకరంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి ఆదేశించారు. మండలంలోని రెండో విడత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల పర్వం నేడు ప్రారంభం కావడంతో శనివారం ఆర్డీవో ఎంపీపీ కార్యాలయంలో నామినేషన్ల గదులను పరిశీలించారు. ఈసందర్భంగా నామినేషన్లు స్వీకరించే పద్ధతులపై అధికారులకు సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వాహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, శాంతి భద్రతల అంశాలపై సమీక్షించారు. కాగా ఎస్ఐ నారాయణగౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల నియమాలను పాటించాలి



చేగుంటలో ఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

చేగుంట నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చూడాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో ఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నికల నియమాలను పాటించి ప్రతి ఒక్కరూ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం రెండో విడత ఎన్నికల నామినేషన్‌ల సందర్భంగా ఆర్వోలకు పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి తహసిల్దార్ శివప్రసాద్, ఎంపీ ఓ ప్రశాంత్, ఆర్వోలు తదితరులు ఉన్నారు. అదేవిధంగా నార్సింగి ఎంపీడీవో కార్యాలయంలోఎంపీడీవో ప్రీతిరెడ్డి, తహసీల్దారు గ్రేసిబాయిలతో కలిసి తూప్రాన్ ఆర్డీవో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్వోలు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నార

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి ఎన్నిక



బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన శేఖర్‌గౌడ్‌తో ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నిక శనివారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. మనోహరాబాద్ గ్రామానికి చెందిన ఇమాంపురం శేఖర్‌గౌడ్‌ను మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గత రెండేళ్లుగా పార్టీకి మండల అధ్యక్షుడు లేకపోవడంతో శనివారం మండల బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. శేఖర్‌గౌడ్ ఎన్నుకోవడంతో బీఆర్ఎస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నారాయణఖేడ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని అన్నారు. శనివారం ఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు తగ్గుతాయన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులకు సైతం తెలియజెప్పాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజిరెడ్డి, సీనియర్ న్యాయవాది మారుతిరెడ్డి, ప్రిన్సిపాల్ మహేష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కు.ని.ఆపరేషన్లకు పురుషులు ముందుకు రావాలి

● సంగారెడ్డిలో డిసెంబర్ 1 నుంచి 4 వరకు శిబిరాలు



డా.వసంతరావు, సంగారెడ్డి డీఎంహెచ్‌వో

సంగారెడ్డి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణకు పురుషులు ముందుకు రావాలని సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.ఎం.వసంతరావు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. కుటుంబ నియంత్రణలో పురుషులు భాగస్వాములు కావాలనే ఉద్ధేశంతో వైద్య ఆరోగ్య శాఖ వాసెక్టమీ(ఎన్ఎస్‌వీ- నో స్కాల్పెల్ వాసెక్టమి)శస్త్ర చికిత్సల శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించిందన్నారు. డిసెంబరు 1 నుంచి 4 వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వాసెక్టమీ శస్త్రచికిత్సల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. ఈ నెల 1 నుంచి 4 వ తేదీ వరకు సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, 1, 4వ తేదీల్లో పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి, 2వ తేదీన జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి, 3న నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రి, 4న జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా వాసెక్టమీ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వాసెక్టమీ ఆపరేషన్లు చేసుకున్న వారికి ఉచిత వైద్య సేవలు, ఉచిత మందులు, ప్రోత్సాహక నగదు, ఆపరేషన్ తర్వాత నిరంతర వైద్య పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కోయకుండా, కుట్లు వేయకుండా ఐదు నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసి పంపనున్నట్టు వివరించారు. అర్హులైన పురుషులు శిబిరాలను వినియోగించుకొని జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డా.వసంతరావు కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



ధాన్యం కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్

నిజాంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మండలంలోని చల్మెడ గ్రామంలో రామాయంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సందర్శించి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతుల సంక్షేమం దృష్ట్యా వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

నమస్తే పథకంతో సఫాయి కార్మికులకు భద్రత



మాట్లాడుతున్న మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి

సంగారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే నమస్తే పథకం సఫాయి కార్మికులు, వ్యర్థాలు సేకరించేవారికి భద్రత కల్పిస్తుందని మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని మెడ్వాన్ సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వంలోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌జేఈ), జాతీయ సఫాయి కర్మచారీస్ ఆర్థిక, అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) ద్వారా నమస్తే పథకాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ పథకాన్ని సఫాయి కార్మికులు, చెత్తను సేకరించే వారికి అందించేందుకు జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో మెడ్వాన్ సంస్థ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18 సంవత్సరాలకు పైబడి ఈఎస్ఐ, పీఎఫ్‌తో సంబంధం లేకుండా ఈ వృత్తిలో కనీసం ఆరు మాసాల పాటు పనిచేస్తున్నవారు ఈ పథకానికి అర్హులన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్‌లు రాజు, హైమ, మెడ్వాన్ కో ఆర్డినేటర్లు స్వప్న, ముజీబ్, హఫీజ్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను చట్టప్రకారమే దత్తత తీసుకోవాలి

● జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పిల్లలను చట్టప్రకారమే దత్తత తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా సంక్షేమాధికారి(డీడబ్ల్యూవో) లలితకుమారి సూచించారు. సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో ఇంటర్నేషనల్ దత్తత మాసోత్సవంలో భాగంగా దత్తత తీసుకున్న, తీసుకోబోయే తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం కారా(సీఏఆర్ఏ)ద్వారానే పిల్లలను దత్తతలను తీసుకోవాలని సూచించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.చక్రపాణి మాట్లాడుతూ పిల్లలకు అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన తర్వాతనే దత్తతలో ఉంచుతామన్నారు. అనంతరం దత్తత మాసోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీవో రత్నం, సీడబ్ల్యూసీ మెంబర్ విష్ణుమూర్తి, పీవో ఎన్ఐసీ లింగం, శిశుగృహ మేనేజర్ మొగులయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఝరాసంగం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులో గల కేంద్రీయ విద్యాలయంలో శనివారం ఆ పాఠశాల 11 వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు, ప్రదర్శించిన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, ఆర్ఐ సాయి, విద్యాలయం ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల జాతర

(5వ పేజీ తరువాయి)

నాలుగు మాత్రమే దాఖలు అయ్యాయి. రెండో రోజైన 28న కొద్దిగా ఊపందుకోగా సర్పంచ్ స్థానాలకు 152, వార్డులకు 186 నామినేషన్లు వచ్చాయి. ఇక చివరి రోజైన శనివారం భారీ సంఖ్యలో నామినేషన్లు నమోదయ్యాయి. అభ్యర్థుల సంఖ్యతోపాటు వారు దాఖలు చేసిన నామినేషన్ల సెట్ల సంఖ్య కూడా భారీగా ఉంది. అర్ధరాత్రి దాటినా ఇంకా లెక్క కొలిక్కి రాలేదు. చివరి రోజు సుమారుగా సర్పంచ్ స్థానాలకు 563, వార్డులకు 2,310 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

సంగారెడ్డి జిల్లాలో

సంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాల్లో తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 147, వార్డులకు 149 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు సర్పంచ్‌లకు 191, వార్డు స్థానాలకు 760 నామినేషన్లు వచ్చాయి. ఇక చివరి రోజైన శనివారం రాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. ఒక్క రోజే సర్పంచ్‌లకు 337, వార్డులకు 2,135 నామినేషన్లు వచ్చాయి. మొత్తంగా సర్పంచ్ స్థానాలకు 675, వార్డులకు 3,044 నామినేషన్లు దాఖలయ్యాయి.